క్లుప్తంగా

## న్యాయ విచారణ జరిపించాలి


నినాదాలు చేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

**మణుగూరురూరల్:** కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలలో యువతులు, మహిళలపై జరిగిన అత్యాచార, హత్యలపై న్యాయ విచారణ జరిపించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకురాళ్లు మాట్లాడుతూ.. ధర్మస్థల అత్యాచార ఘటనపై సిట్టింగ్ జడ్జ్ చేత విచారణ జరిపించి నేరస్తులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, ప్రధాన కార్యదర్శి మంగ, గీత, హరిత, జిల్లా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, కార్యదర్శి భూలక్ష్మి, ఇఫ్టూ నాయకురాలు అనురాధ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ

**అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ):** ఓపెన్‌స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ కోరారు. మండలంలోని ఎర్రగుంట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన ఓపెన్‌స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 14 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓపెన్ స్కూలింగ్ ద్వారా పదో తరగతితోపాటు ఇంటర్‌మీడియట్ చదువుకోవచ్చన్నారు. గతంలో ఇంటర్ ఫెయిల్ అయిన వారు సైతం సబ్జెక్ట్స్ మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సునందారెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, బాబురావు, బాలు, సుశీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**అశ్వాపురం:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అశ్వాపురం ఎస్సై మధుప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుప్రసాద్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటై విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రులను, ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రామచంద్రారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఎస్పీకి వినతి

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణానికి చెందిన రాయల శ్రీనుపై ఇటీవల భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అతని అనుచరులు అకారణంగా దాడికి పాల్పడ్డారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చాకలి ఎస్సీ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, రాష్ట్ర రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకముందు భద్రాచలం రజక సంఘం ఆధ్వర్యంలో చర్ల రోడ్డులో ఉన్న టీవీ స్టేషన్ నుంచి ఏఎస్పీ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల రజక సంఘం నాయకులు గండేపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

**డిపో మేనేజర్‌కు..**

**మణుగూరురూరల్:** ఆర్టీసీ మణుగూరు డిపో నుంచి గోదావరి ఖనికి ఎక్స్‌ప్రెస్ బస్సులను పునరుద్ధరించి నడపాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ.. మణుగూరు ఏరియా నుంచి గోదావరిఖనికి ఉన్న రెండు ఎక్స్ ప్రెస్ బస్ సర్వీసులను రద్దు చేసి సూపర్ లగ్జరీ బస్సులను నడిపిస్తుండడం దారుణమన్నారు. ఉచిత బస్సు పథకాన్ని పక్కదారి పట్టించేలా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను గోదావరిఖనికి నడపకపోవడం సరికాదన్నారు. అలాగే మణుగూరు నుంచి విశాఖపట్నం బస్సులు నడిపించాలన్నారు. ఐద్వా నాయకులు పిట్టల నాగమణి, తోట పద్మ, కోండ్రు గౌరి, బందారు సారిక, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, బొల్లం రాజు, సున్నం మల్లేష్, గుర్రం నరసయ్య పాల్గొన్నారు.

## కార్గిల్ విజయ్ దివస్

**మణుగూరురూరల్:** మండలంలోని బొంబాయికాలనీలో ఉన్న ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. తొలుత కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు ప్రిన్సిపల్ భాను ఖాన్, కరస్పాండెంట్ జేఎం ఖాన్‌లు శ్రద్ధాంజలి ఘటించారు. విద్యార్థులు జవాన్లనుద్దేశించి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




వివిధ రకాల రెయిన్ సూట్లు, జాకెట్లు

# రెయిన్ కోట్లకు క్రేజ్!

- వర్షంలోనూ ప్రయాణాలు, పనులకు ఉపయోగం
- బ్రాండెడ్. అన్ బ్రాండెడ్‌లో లభ్యం
- భద్రాచలంలో పలుచోట్ల అమ్మకాలు


పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న రెయిన్ కోట్లు

సండే స్పెషల్

**భద్రాచలంఅర్బన్:** వర్షాకాలం ఇల్లు వదిలి బయటకు వెళితే ఏ క్షణం వర్షంలో తడుస్తామో తెలియదు. ఈ క్రమంలో అలంకార ప్రియులకు ఈ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. ఇలాంటప్పుడు తడవకుండా కాపాడడంతోపాటు.. అదిరే గెటప్‌ను ఇవ్వడానికి రెయిన్ కోట్లు, మాన్ సూట్లు ఉపయోగపడుతాయి. వీటికి భద్రాచలం పట్టణంలో అన్ని వర్గాల వారి నుంచి క్రేజ్ ఉంది.

**అన్ని వర్గాలవారికి ఉపయోగం..**

వర్షాకాలంలో వర్షం నుంచి కాపాడేందుతూ.. తొడిగితే వెచ్చదనాన్ని ఇస్తూ.. చూడటానికి మనస్సు నచ్చేలా మాన్సూట్స్ ఆకట్టుకుంటున్నాయి. వెరైటీ డిజైన్లలో ఉండే మాన్సూట్స్ అన్ని వర్గాలవారి ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా స్కూల్‌కు వెళ్లే పిల్లలు, ఆఫీసులకు వెళ్లే పెద్దలు, ఫీల్డ్‌లో ఉండే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ తప్పనిసరిగా వర్షంలో బయటకు పోవడానికి రెయిన్ కోట్లు వాడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి గొడుగులను వినియోగించడం కొంత కష్టమైనపని కావడంతో లేటెస్ట్ రేయిన్సూట్లకు ప్రాధాన్యతనిస్తున్నారు. తడవకుండా రక్షణ ఇవ్వడంతోపాటు చూసేవారికి ఆకట్టుకునే గెటప్‌లో కనిపించేలా చేస్తున్నాయి.

**లేటెస్ట్ డిజైన్లలో..**

స్టైలిష్‌గా తయారయ్యే అలంకార ప్రియులను మెప్పించడానికి మార్కెట్‌లో లేటెస్ట్ డిజైన్లలో మాన్సూట్స్ ఉన్నాయి. రంగురంగుల డిజైన్లలో భద్రాచలంలో ఉన్న వస్త్ర దుకాణాలు, వస్త్ర షోరూంలు, స్ట్రీట్ వెండర్స్ వివిధ రకాల రెయిన్సూట్లు విక్రయిస్తున్నారు. బ్రాండెడ్‌లో రీబాక్, వుడ్ ల్యాండ్, నైక్, వంటి బ్రాండెడ్ కంపెనీలతో సహా అన్ బ్రాండెడ్‌లలో కూడా అనేక రకాలున్నాయి. భద్రాచలం పట్టణంలోని యుబీ రోడ్డు, పాత మార్కెట్, సీఎస్ఐ చర్చి ప్రాంతాల్లోని షాపుల్లో సూట్లను విక్రయిస్తున్నారు.

**అందుబాటు ధరల్లో..**

భద్రాచలం పట్టణంలో మార్కెట్‌లో అందమైన మాన్సూట్స్ అన్నివర్గాల వారికి అందుబాటు ధరల్లో ఉన్నాయి. రెయిన్ ప్యాంట్, షర్ట్, జాకెట్, లాంగ్ జాకెట్, టూ ఇన్ వన్ జాకెట్, లెదర్ జాకెట్, రెగ్జిన్బ్యాక్ గ్రౌండ్ సూట్లు తయారవుతున్నాయి. వీటిని వ్యాపారులు హైదరాబాద్, ముంబాయి వంటి వివిధ పెద్ద పెద్ద నగరాల నుంచి తెప్పిస్తున్నారు. బ్రాండెడ్‌లో రూ.1,200 నుంచి అందుబాటులో ఉండగా, అన్ బ్రాండెడ్లో రూ.200 నుంచి రూ.1,000 లోపు ధరలో ఉన్నాయి.

**వాహనాలపై సౌకర్యవంతంగా..**



వానాకాలంలో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారందరూ రెయిన్ కోట్‌లు వేసుకోవాల్సిందే. వాహనాలపై వెళ్లడానికి గొడుగుకంటే మాన్ సూట్స్ సౌకర్యవంతంగా ఉంటాయి. బ్రాండెడ్ సూట్స్ చూడటానికి అందంగా.. పదికాలాలు మన్నికగా ఉంటాయి. భద్రాచలంలో చాలా రకాల మోడల్స్‌లో లభిస్తున్నాయి.

– కీసరి శివ, భద్రాచలం

**యువత ఇష్టపడుతున్నారు..**



స్టైలిష్‌గా ఉండే బ్రాండెడ్ మాన్ సూట్లను యూత్ ఇష్టపడుతున్నారు. కస్టమర్లు మెచ్చే మోడల్స్‌లో తెప్పించాం. హైదరాబాద్ వంటి నగరాల ధరల్లోనే స్థానికంగా అందిస్తున్నాం. ఎక్కువగా ఇండివిజ్యువల్‌గా ఉండే రెయిన్ సూట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

– దొడ్డిపట్ల కోటేష్, ఆరెకే ఫ్యాషన్స్ యజమాని, భద్రాచలం

# కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం


రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**బూర్గంపాడు:** సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడులోని మార్కెట్‌యార్డు ఆవరణలో శనివారం కొత్త రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఏపీఎం నాగార్జున, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జికి మరమ్మతులు

**మణుగూరుటౌన్:** కార్మికులు విధులకు హాజరయ్యే ప్రధాన దారిలోని రైల్వే అండర్ బ్రిడ్జికి అధికారులు మరమ్మతులు పూర్తి చేశారు. సింగరేణిలోని ఓసీ–2, కేపీయూజీలకు కార్మికులకు ఇదే దారి గుండా విధులకు హాజరుకావాల్సి ఉండగా.. ఏటా వానకాలం వచ్చిందంటే ఇక్కడ భారీగా నీరు నిలుస్తోంది. లైట్లు ఉండవు. కార్మిక సంఘాలు, పలుమార్లు ఏరియా జీఎం దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో రూ.10లక్షల నిధులు విడుదల చేయడంతో సివిల్ విభాగం ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం మరమ్మతులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు పూర్తి చేయడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మరమ్మతులు పూర్తయిన రైల్వే అండర్ బ్రిడ్జి

# రైతుకు పరిహారం అందజేత

**మణుగూరుటౌన్:** ఓసీ–4 కట్టతెగి వరద నీరు ప్రవహించి నష్టపోయిన రైతుకు శనివారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ పరిహారం చెక్కును జీఎం కార్యాలయంలో అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022–23 వర్షాకాలంలో ఓసీ–4 కట్ట తెగి తాటి భానుచందర్ పంట పొలంలో ప్రవహించి 1.20 ఎకరాల భూమిలో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ నివేదిక సూచన మేరకు బాధిత రైతుకు రూ.3,42,720 చెక్కును పరిహారంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) రమేశ్, ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వైద్యశిబిరాలు

**కరకగూడెం:** మండల పరిధిలోని రేగుళ్ల గ్రామంలో కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులను పరీక్షించి.. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యశిబిరంలో హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** మండలంలోని వాగుమల్లారం ప్రాంతంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నిశాంత్‌రావు గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న పలువురి రక్తనమూనాలను సేకరించారు. అనంతరం డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. వర్షాకాలమైనందున సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు. అనారోగ్యాలు వస్తే ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. వైద్యసిబ్బంది ఇంటింటిని సందర్శించి నీటి నిల్వలను శుభ్రం చేయించారు. సబ్ యూనిట్ అధికారి వీరస్వామి, హెచ్‌వీ జానకి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, అనసూర్య, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కరకగూడెం: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

## విద్యుదాఘాతంతో ఆవు మృతి

**అశ్వారావుపేటరూరల్:** మేత కోసం వెళ్లిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. అశ్వారావుపేట గుర్రాల చెరువు మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ఎర్రబోయిన వెంకన్నబాబుకు చెందిన ఆవు మేత తినే క్రమాన విద్యుత్ స్తంభానికి ఉన్న ఎర్త్ వైరుకు తాకింది. దీంతో షాక్ గురై మృతి చెందింది.

## నోడ్యూ సర్టిఫికెట్ నిబంధన తొలగించాలి

**దుమ్ముగూడెం:** రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నోడ్యూ సర్టిఫికెట్ నిబంధన తొలగించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నో డ్యూ సర్టిఫికెట్'వల్ల అప్పు కోసం బ్యాంకుకు వెళ్లిన రైతులకు రుణం ముట్టడం లేదని, బ్యాంకుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సమావేశంలో ఉపాధ్యకులు నటరాజ్ స్వామి, అప్పల రెడ్డి, సందీప్ రెడ్డి, శ్రీనివాస్, మట్ట వెంకటేష్, సాదే వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు కిట్లు పంపిణీ

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఉన్న గర్భిణులకు శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ.. మ్యాటర్నల్ అండ్ చైల్డ్ న్యూట్రీషన్ మంత్‌ను పురస్కరించుకుని ఆస్పత్రిలోని 60 మంది గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేసినట్లుగా తెలిపారు. అదే విధంగా భద్రాచలం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇందులో భాగంగా ముగ్గురు విద్యార్థులకు గాను రూ.35వేలు అందించారు. కార్యక్రమాలలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి మహేంద్ర, కోశాధికారి హరి ప్రసన్న, ఉపాధ్యక్షుడు అజీమ్, ప్రోగ్రామ్ చైర్మన్ డాక్టర్ భరణి బాబు, డాక్టర్ రామకృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కమల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి, మోర్తాల సిద్ధారెడ్డి, డాక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

**ములకలపల్లి:** ఉపాధ్యాయ, విద్య, ఉద్యోగ రంగాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం టీఎస్‌యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ భూక్యా గనియాకు వినతిపత్రం అందజేశారు. సీహెచ్.బుచ్చిరాములు, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కిషోర్, ప్రధాన కార్యదర్శి ఎల్.అశోక్, మండల కమిటీ సభ్యులు కె.గోవింద్, వి. కిరణ్‌కుమార్, బి.సుందర్, ఎల్.రాందాస్ పాల్గొన్నారు.

# విపత్తులపై అవగాహన

**దుమ్ముగూడెం:** మండలంలోని పర్ణశాల గోదావరిలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు శనివారం కమ్యూనిటీ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర సమయంలో తలెత్తే విపత్తుల నుంచి ఏ విధంగా ఎదుర్కోవాలో అనే అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. వరదల సమయంలో మనుషులు గోదావరిలో మునిగితే చేపట్టాల్సిన కార్యక్రమాలను డెమో ద్వారా తెలియచేశారు.

కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంఈఓ సమ్మయ్య, ఇరిగేషన్ జేఈ రాజ్‌సుహాస్, ఏఈ హర్షనాగు, గిరధావర్లు వెంకటేశ్వరరావు, నరసింహారావు, పీటీ మస్తాన్ వలీ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


గోదావరిలో మునిగిన వ్యక్తిని కాపాడే తీరును వివరిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**దమ్మపేట:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలపై ఎమ్మెల్యే జారే, శనివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల, విద్యుత్, రెవెన్యూ, పంచాయితీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడూ పరిశీలించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తే, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


దమ్మపేట: అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జారె

**పాఠశాలలో తనిఖీ..**

**చంద్రుగొండ:** మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తరగతి గదిలోకి ప్రవేశించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే ఎవరూ? అంటూ ప్రశ్నలు వేసి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు వేసి విద్యార్థుల సమార్థ్యాన్ని తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే.. వాటిని త్వరలోనే పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఏ వాజీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చప్టాను పరిశీలించిన డీఎస్పీ


చప్టా వద్ద ఎస్ఐకు సూచనలిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

**అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ):** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. మండలంలోని అబ్బుగూడెం–కట్టుగూడెం గ్రామాల మధ్య ఉన్న ఎదుళ్లవాగుపై ఉన్న చప్టాను ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో వరద వచ్చే అవకాశం ఉందని, ముందుజాగ్రత్త చర్యగా రాకపోకలను నిలిపి చేయాలని ఆయన పోలీసులకు సూచించారు. ఆయన వెంకట ఎస్ఐ సీహెచ్.చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## చెరువు నీటిని తోడించాలి


చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని అహోబిలం మఠం వెనుక ఉన్న చెరువు నీటిని బయటకు తోడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ముదిరాజ్ బజార్, అంబా సత్రం ఏరియాలలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఏజే రమేష్ మాట్లాడుతూ.. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అహోబిలం మఠం వెనుక ఉన్న చెరువు నిండిపోయిందని, దాని బ్యాక్ వాటర్‌తో చుట్టూ ఉన్న సుమారు 150 కుటుంబాలు ముంపు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యుడు బండారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యులు సీహెచ్.మాధవరావు పాల్గొన్నారు.

## ఐక్యంగా హక్కులు సాధించాలి

**మణుగూరుటౌన్:** సింగరేణి బీసీ ఉద్యోగులంతా ఐక్యంగా హక్కులు సాధించుకోవాలని బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రమౌళి అన్నారు. శనివారం పీవీకాలనీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి బీసీ నాయకులు, సీఎంఓఏఐ అధ్యక్షుడు, పీకేఓసీ పీఓ తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిల సురేశ్‌తో పాటు మరో 15 మందితో నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవం అయ్యింది. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పూస వసంత్‌కుమార్, కోలాశ్రీనివాస్, పి.వీరభద్రరావు, ఏరియా బీసీ ఎంప్లాయిస్ నాయకులు షేక్ అబ్దుల్ రవూఫ్, కోడి కృష్ణమూర్తి, షాబుద్దీన్, అమీనుద్దీన్‌తో పాటు 300 మందికి పైగా బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

**దుమ్ముగూడెం:** మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని శ్రీ దాసాంజనేయ ఆలయంలోని ప్రధాన అర్చకుడు ఆరుట్ల రాజగోపాల్ చార్యులు మార్చి 2న రోడ్డు ప్రమాదంలో మరణించగా.. దాసాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీనగరం గ్రామస్తులు రూ.2,52,000లను రాజగోపాలచార్యుల కుటుంబానికి అందజేశారు. పిన్నింటి కమలా రాజశేఖర్, సిరపు వీర రాఘవరెడ్డి, గుడ్ల శ్రీనివాస్ రెడ్డి, గుడ్ల తాతారావు, పంపన శివరావ్, సరోజ, అనసూయ, దల్లి హరిబాబు, పంపన పవన్, సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు ఉద్యమించాలి

**ములకలపల్లి:** ఎరుకల హక్కుల సాధనకు ఉద్యమించాలని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి (ఏఐవైహెచ్‌పీఎస్) మండల అధ్యక్షుడు నారాయణ ఎరుకల పిలుపునిచ్చారు. ములకలపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సంఘ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఇతర కులాలకు చెందిన కొందరు ఎరుకల కులస్తులుగా తప్పుడు ఎస్టీ ధ్రువపత్రాలు పొందారని, వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ బి.గనియాకు వినతిపత్రం అందజేశారు. సంఘ తెలంగాణా రాష్ట్ర ఎంప్లాయిస్ కో–కన్వీనర్ గరికె శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రకాష్ ఎరుకల, ముఖ్య సలహాదారు గరికె రాంబాబు ఎరుకల తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామి కల్యాణం

**అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ):** మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రసాదచార్యులు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోత్సరణల నడుమ స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆలయం ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**దళారుల మాటలు నమ్మొద్దు..**

మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి అగ్రహారం ఉన్న భూములను పట్టాలు చేస్తామని కొంతమంది దళారులు చెప్తున్న మాటలను నమ్మి మోసపోవద్దని ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదైవం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 40/1/బ లో 200 ఎకరాలు కాళ్ళూరి వంశస్తులు ఆలయానికి అగ్రహారంగా దానం చేశారన్నారు. అయితే అందులో సీతారామ కాలువ నిర్మాణంలో 22 ఎకరాల భూమి ముంపుకు గురైందని, ఆ భూమికి ఎలాంటి పరిహారమూ రాలేదని అన్నారు. ఇదిలా ఉండగా మిగిలి ఉన్న 178 ఎకరాల భూములు కౌలు ఒప్పందంపై రైతుల ఆధీనంలో ఉన్నాయని వెల్లడించారు. సదరు భూములను పట్టాలు చేయిస్తామని కొంతమంది అక్రమార్కులు రైతుల నుంచి ఎకరాకు రూ.1.5 లక్షలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారి మాటలు నమ్మి కౌలు రైతులు మోసపోవద్దని ఆయన సూచించారు. వెంకన్నస్వామికి మొత్తం 2,464 ఎకరాల భూములు ఉన్నాయి తెలిపారు. సమావేశంలో ఆలయ సిబ్బంది రామారావు, సంపత్, నర్సింహారావు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవస్థానం మేనేజర్ రమణ